# మూగపోయిన ప్రకృతి

"స్ఫురదతి ముక్తలతా పరిరంభణ ముకుళిత పులకిత చూతే
బృందావన విపినే పరిసర పరిగత యమునా జల పూతే"

ఎంత అందమైన సమాసం ? సర్వసాక్షికి మనోవాక్కాయ సాక్షిగా ప్రణతులర్పిస్తూ జయదేవ కవి అష్టపది వసంత రాగంలో ఈలగా పాడుకుంటూ పుంత వెంబడే నడుస్తున్నాను. అది రాధామాధవుల ప్రణయ విహారాల కాటపట్టు అయిన యమునా సైకతస్థలి కాదు. ఆంధ్రదేశంలో పశ్చిమ గోదావరి జిల్లాలో చుట్టూ అయిదారు వందల ఎకరాలు వరి పంటకు ప్రాముఖ్యం ఇచ్చే ఒక పల్లెపట్టుకు కాలిబాట. బాటకిరువైపులా ముక్తాలతలచేత కౌగిలింపబడినట్లు స్ఫురించగా సిగ్గుపడి పులకించిపోతున్న మామిడిచెట్లు లేనేలేవు – సీమచింత చెట్లూ, ఈతచెట్లూ, తుమ్మచెట్లూ తప్ప. పరిసరాలు యమునా జలంచేత పవిత్రమైనటువంటి బృందావనము కాదు కదా ! అయితే నేమి ? ఆ ప్రశాంత అసుర సంజలో నా సర్వేంద్రియాలూ మైమరపించే చల్లని గాలిలో ఆ పాట నా గొంతులో ధ్వనించింది. ఇంతలో అయిదారుగురు కాపు పిల్లలు దూరంగా గుమిగూడి ఎవర్నో గద్దిస్తున్నారు. ఒక

పిల్లాడు తాటి కమ్మ చేతిలో పట్టుకుని బెదిరిస్తున్నాడు. నా అనిర్వచనీయ ఆనందానుభూతికి అడ్డుపడే ఆ పిల్ల మూటకను పరీక్షించి చూశాను. పది-హేనేళ్ళ పిల్ల చుట్టూ చేరారు. ఆ పిల్ల చెంగున కట్టుకున్న మూటను గుండెలకు హత్తుకుని నిలబడ్డది. పిల్లలు మూట విప్పమని గోల చేస్తున్నారు. ఆ అమ్మాయి ఉలకదు; పలకదు, మూటను ఇంకా ఇంకా గుండెలకు హత్తుకుంటున్నది. ఆ హత్తుకోవటంలో భూదేవి సీతను తనలో ఐక్యం చేసుకొన్నట్లుగా తన గుండె రెండుగా చీలి ఆ మూటను ఐక్యం చేసుకోకూడదా! అన్నంత లాల సత్వం కన్పించింది. సన్నగా చీలికలుగా ఉన్న ఆమె కను కొలకులు ఈ కుర్రకుంకలమీాది వ్యర్థకోపంతో అరుణిమను పులుముకొన్నవి.

"ఏమిటరా గొడవ?" అన్నా. కుర్రాళ్ళంతా నాకేసి తిరిగారు. అందులో ఒకడు "చూడు అయ్యా! ఈ దొంగ ముండ! మా పాటిదిబ్బమీాదున్న 'కాకరకాయ'లన్నీ గిచ్చేసు కున్నాది. కూాస్ని ఇవ్వటానికి సత్తున్నాది" అన్నాడు రొప్పుతూ.

"దాన్దేం తప్పునేదు బాబూ! ఆళ్ళమ్మ పనిగట్టుకెళ్ళి ఎక్కడెక్కడేం ఉన్నాయో చూసి చెపుతాది. ఇదెళ్ళి అన్నీ లంకించుకొత్తాది" అన్నాడు ఇంకొకడు. తాటికమ్మ పుచ్చు కున్న కుర్రాడు నేనున్నానుకదా అనే ధైర్యంతో ఆ పిల్ల మూట పట్టుకున్నచోట కమ్మతో ఒక దెబ్బ వేశాడు. కమ్మ ఇరువైపులా గరుగ్గా ఉండటంచేత ఆ పిల్ల చెయ్యి చీరుకుపోయి

రక్తం చిమ్మింది. మూట విడివడి ములక్కాడలా నొక్కులుగా ఉండి అంగుళం అంతంతున్న కాయలు కిందపడ్డాయి. తుక్కులా ఉన్న ఏదో ఆకుకూర కూడా కింద పడింది. కుర్రాళ్ళందరూ ఆత్రంగా కిందకు వంగి ఆ కాయలు ఏరుకుంటున్నారు. ఆ పిల్ల స్తబ్ధుగా కాస్సేపు నిలబడింది. ఆమె కళ్ళల్లో నీళ్ళూరుతున్నాయ్. గమ్మున తాటి కమ్మ లాక్కుని పుంత వెంబడే పరుగెత్తుకుపోయింది.

"ఓరి నాయనో! ఎక్కడ్నో దాంకుంటదీ! నీక టపకుండా పోవాల" అన్నాడు ఒకడు.

"ఏమిటంత భయం ఆ పిల్లంటే? ఆ కాయ లేం చేస్తారు? ఆ ఆకు లేమిటి" అని అడిగాను కుతూహలంగా.

"ఇవండీ, ఇవండీ, మరండీ, తాలింపులో ఏసి కూరొండుతారు. ఈ ఆకు గంగబాయిలి కూరంటారు. ఇదీ ఇగురొండచ్చు" అన్నాడు కాయలు ఏరుకున్న కుర్రాడు.

"పోనీ, ఆ అమ్మాయికి ఆ కూర తిందామనుందేమో! మీరెందుకని ఊళ్ళాక్కున్నారు?" అన్నా.

"అయ్యో మా అమ్మ మనసుపడి దిబ్బమీద ఏసుకుండాది, ఎన్నోసార్లు కోద్దరి కోద్దరి అనుకుంటానే! ఈ ముండ కోసుకెళ్ళి పోతున్నది గావాల్న."

"ఆ పిల్లంటే భయం దేనికీ!"

"భయవాఁ! ఉత్త రాలుగాయి పాపండీ. ఏ చెట్టు చాటునో నక్కుతాది. మే మటెళ్ళేసరికి మీదపడి బాదుతాది."

"బాబూ! మీరు కూడా మా ఎంటే నడవండి" అన్నాడు ఇంకొకడు. నేను వాళ్ళతో బాటు నడుస్తున్నాను. బోదెగట్టుమీది సరుగుడు చెట్లు చల్లని గాలికి మెల్లగా ఊగుతూ సంగీతం పాడుతున్నాయి. వాటి జోలపాటలకు నిద్ర గన్నేరు చెట్లు నెమ్మదిగా ఆకులు ముడుస్తూ నిద్రకు తలపడుతున్నాయి. ఆ కుర్రాళ్ళు బిక్కుబిక్కు మంటూ నడుస్తున్నారు. నేను వాళ్ళ ముఖాల్లోని భీరుత్వాన్ని పసిగట్టి నాలో నేనే నవ్వుకున్నాను. ఇంతలో ఒక చేతిలో తాటి కమ్మ, రెండో చేతిలో ఈత మట్ట పుచ్చుకుని పూనకం వచ్చిన మనిషిలాగ "ఊంమా, ఊంమ్మామ్మా" అంటూ కుర్రాళ్ళ మీద పడి కొట్టసాగింది. దబ్బలంలా మొనలు తేరిన ఈతాకుల తాకిడికి గోచీ తప్ప ఇంకో బట్టలేని కుర్రాళ్ళ ఒళ్ళంతా చీరుకుపోగా పిల్లలంతా గోలగా అరుస్తూ తలో దిక్కూ పోయారు.

"హి హీ హీ ..." విపరీతంగా నవ్వసాగింది. చీకటిలో కలిసిపోయే నల్లని ముఖంలో తెల్లగా మంచి ముత్యాలల్లే మెరుస్తున్న ఆ పళ్ళు తళుక్కుమన్నాయి. నేరేడు పండు రంగులో నిగనిగలాడుతున్న చెంపలు విజయోత్సాహంతో ఉబ్బిపోసాగాయి. చేతిలోని అస్త్రాలు కింద పారేసి గాలికి ఎగురుతున్న ఓణీని మొలలో దోపుకుంటూ నన్ను చూసి, "సారీగా సారీగా" అని పాడుకుంటూ చకచకా నడవసాగింది. చీకట్లు దట్టంగా ముసురుతున్నాయి. ఆ పిల్ల నిర్భయంగా నడవడం చూస్తే నా ఒళ్ళు గగుర్పొడిచింది. రాణీ రుద్రమ

దేవి అవతారమా? ఏం ధైర్యం? నన్ను చూసి అణుమాత్రం చలించలేదు. నిమిత్తమాత్రురాలు లాగ తాను చేయదలచుకున్న దేదో చేసి తిరిగి చూడకుండా పోతూంది. నాకు జిజ్ఞాస రేకెత్తింది. ఆ పిల్లను గురించి తెలుసుకోవాలని ఆపుకోలేని ఆకాంక్ష కలిగింది.

"ఏయ్ ఆగు!" అన్నాను. నాకేసి తిరిగిచూడకుండానే నిలబడింది. సమీపించా.

"నీ పేరేమిటి?"

సన్నని కళ్ళు ఇంకా సన్నగా చీకిరించింది. అప్పుడే ఈతచెట్ల మీదుగా ఉదయిస్తున్న చంద్రుడి కిరణాల జాడల్లో ఆమెను పరిశీలించాను. పొట్టిగా ఉన్న పువ్వుల పరికిణీ దోసెడు వెడల్పున అంచులు అతుకు వేసినది ధరించింది. అడుగు వెడల్పు ఉన్న పాత చీరగుడ్డ వోణీ వేసుకున్నది. ముగ్గురు స్త్రీలకు సరిపోయేటంత వదులుగా ఉన్న రవిక తొడుగుకొన్నది. మెడకు బిగుతుగా ఎర్రటి పలక పూసలు కట్టుకున్నది. దుమ్ము కొట్టుకుపోయి ఒత్తుగా మెలికలు తిరుగుతున్న రాగి వెంట్రుకల్ని పురికొసతో గట్టిగా కట్టింది. ఆమె పాదాల కదలికవల్ల కాలినున్న సత్తు కడియాలు, అందెలు, గొలుసులు "ఛన్ ఛన్" మంటున్నాయి.

"నీ పేరేమిటి?" మళ్ళీ అడిగాను.

ఆ పిల్ల "ఇహి హీ హీ" అని నవ్వి "సా రీ" అవరోహణలోనూ, "గా" ఆరోహణలోనూ అంటూ పరుగెత్తిపోయింది. నేను ఆలోచిస్తూ ఇల్లు చేరాను.

"ఏరా, ఇంతాలస్యం అయిందే? ఆకుమళ్ళకేసి వెళ్ళావా?" అంది మా అక్కయ్య.

"ఏమోయ్! నీ షికారు పుంతతోనే ఆఖరు చెయ్యాలి. ఆకుమళ్ళ చెరువు గట్టున త్రాచుపాము పుట్టలున్నాయ్. చీకటి పడితే ప్రమాదం" అన్నాడు మా బావ. నా మనస్సులో ఆ పిల్ల రూపే మెసులుతూంటే చిన్నగా నవ్వి స్నానానికి బయలుదేరాను.

## 2

తెలతెల్లవారుతూంది. మా అక్క గుమ్మం ముంగిట ముగ్గు పెడుతూంటే జీతగాడు నీళ్ళకావిడేసుకుని బయలుదేరాడు. నేను మంచంమీదే బద్ధకంగా దొర్లుతున్నాను. "ఛన్ ఛన్". పరిచయమైన కాలిచప్పుడు నా చెవిలో సంగీతం పాడింది. ఒక్క ఉదుటున లేచి మంచం నడుంగా కూర్చున్నాను. ఆ పిల్ల తట్ట నెత్తినెట్టుకొని పనిమల్లే గబగబా నడుచుకుపోతూంది.

"తెల్లవారిందో లేదో అప్పుడే తయారు! ఇవ్వాళ ఎక్కడికో దండయాత్ర!" అంది మా అక్క.

"ఎవరే అక్కా?"

"అదుగో పోటంలా, శంకూ."

"శంకా!"

"దాని పేరు శంకరిలే. దాని తల్లి అన్నమ్మ. ఇద్దరికిద్దరే ఉత్త దొంగపీనుగులు. ఊరిమీద పడి బ్రతుకుతారు.

తట్ట నెత్తినేసుకు పోతూందా? ఎవళ్ళ పాకల్లోనో దూరి పేడ కళ్ళెత్తుకు పోతుంది. గడ్డి మేటుల్లో జనపకట్టలు దాస్తామా? అవి లాగేసి కాపుల మందకు అందించేస్తుంది. వాళ్ళు ఉత్తినే పాలూ, మజ్జిగా పోస్తారు. ఇంక పాదులు పెత్తే కాయలు అన్నీ దీని పరమేకదా! ఎల్లా కనిపెట్టారో తెల్లారి కోసుకుందామనుకునేసరికి మాయం చేస్తారు. మీ బావ ప్రెసిడెంటు కదా! కాస్త వెళ్ళగొట్టించండి అంటే నా మాట వినరు.

"కాయలు ఎత్తుకెళ్ళి అమ్ముకుంటుందా అక్కయ్యా?"

"అవునవును. మన జనపకట్టలూ, కూరగాయలూ అమ్ముకునే అన్నమ్మ పలకసర్లు చేయించుకుంది. ఎందుకూ, పొద్దున్నే తిట్టుకుంటావ్ వాళ్ళనీ!" అన్నాడు మా బావ. మా అక్క కొత్తగా పలకసర్లు చేయించుకొంది. మా బావకు తెలీకుండా వడ్లు అమ్ముతుంది.

"దానిమీద ఈగవాలితే ఇంట్లో దయ్యమౌతారు మీరు. మీలాంటి పెద్దమనుష్యులుండబట్టే దాని దొంగతనాలూ అవీ సాగుతున్నాయి!" దీర్ఘం తీస్తూ ముగ్గుచిప్పట్టుకుని లోపలకు వెళ్ళిపోయింది.

"పాపం. వాళ్లు కాందిశీకులురా రామం! ఆ పిల్లది మూగది. అన్నమ్మకు ఏ పనీ చేతగాదు. ఇక్కడా అక్కడా దొరికినవి వాళ్ళ పొట్టలకే చాలవ్. ఇంకేం అమ్ముకుంటారు చెప్పు!" అన్నాడు బావ. ఆ వనకన్య మూగదా! ఆమె చీకిరి కళ్లూ, నునుపైన చెంపలూ, ఆమెలోని వ్యక్తం చేయలేని భావాలకు భాష నింపుకో జూస్తున్నాయా? శంకరి!

శంకూ! "ఊంమా ఊంమ్మామ్మా." నా మనస్సు అజ్ఞాత వేదనతో నిండింది. సాయంత్రం అనుకోకుండా అన్నమ్మ గుడిసెవేపు మళ్ళాయ్ నా కాళ్ళు. ఆమెను చూడగానే నా కెందుకో మహాశ్వేత వృత్తాంతం తలపు కొచ్చింది. శంకూ అంత మురికిగా లేదు. ధవళ వస్త్రం ధరించింది. శంకూ జుట్టులాగే మెలికలు తిరిగే జుట్టుకు వాసన తైలం రాసుకున్నది. ఈతాకుల దడితో అడ్డుకట్టిన వసారాలో రెండు మంచాలు వాల్చి ఉన్నాయ్. నులక మంచంమీద చినిగిన బొంత. నవ్వారు మంచంమీద ఇస్త్రీ దుప్పటి పక్క-లేసి ఉన్నాయ్. ఆరోగ్యంగా ఉన్న ఆమె చేతులు జొన్నలు విసురుతున్నాయ్. అటే చూస్తూ కూర్చున్నాను. ఆమె భాష నాగరకంగా ఉన్నది.

"ఈ చేతులు కష్టానికి అలవాటుపడ్డవి కావు, బాబూ. సుతారంగా తములపాకులు ఈనెలు తీసి చిలకలు చుట్టి అందిచ్చే తామరతూడులు. ఈనాడు కష్టపడి పిండి విసురుతున్నాయ్."

"మీ దేవూరు ?"

"ఏదని చెప్పను ? మా పూర్వీకులు సిరికాకుళము తాలూకాలో నరసన్నపేట దగ్గర సత్యవరంవాళ్లు. నేను నైజాంలో పుట్టి పెరిగాను. రజాకార్ల గొడవల్తో హడలిపోయి పారొచ్చాను" అన్నది.

"ఊఁహు! మీ పూర్వీకులు తూర్పు అన్నమాట!"

"చిత్తగించండి" అన్నది. ఆమె పిండి విసురుతూ ఆయాసపడటంలేదు. వినూత్నమైన ఆ చేతి కదలికలో

అపూర్వ లాస్యం గోచరిస్తున్నది. శంకూ "ఛన్ ఛన్" చప్పుడు చేసుకుంటూ అర్ధ శేరు ఎర్రగా కాగినపాలు ఇత్తడి గ్లాసుతో తెచ్చిచ్చింది. కలకండ, ఏలకుపొడి, పచ్చ కర్పూరం, కుంకుమ పువ్వు మిళితమైన సువాసనతో ఉన్న పాలు తీసుకోవచ్చో, లేదో అని ఆలోచిస్తున్నాను.

"తీసుకోండి. మీ బావగారు అభ్యంతరం చెప్పరు" అన్నది. ఆమె మరల చెప్పనారంభించింది :

"సత్యవరంలో ఎర్రసాని చెరువు ఉంది చూస్తిరా? ఆ ఎర్రసాని మా వంశీకురాలు. ఎర్రసాని ప్రాయంలో అతులితమైన ఐశ్వర్యంతో తులతూగింది. అసమాన అందాల రాశి. దైవభక్తురాలు. ఆమె అందానికి విలువ కట్టలేని సంస్థానాధీశ్వరులు జోహార్లు అన్నారు. ఆమె పెదిమల చివరి చిరునవ్వుకోసం పడిగాపులు పడివుండేవారు. ఆమె కనీనికల కదలికను చూసి మూర్ఛబోయినవారు వేనవేలు." అన్నమ్మ శృంగారంగా నవ్వింది. ఆమె నెన్నుదురు చమటతో తడిసింది.

"ఊఁ" అన్నాను.

"ఆ పుత్తడిబొమ్మ సూర్యోదయ కాంతుల్లో పచ్చని తోటల్లో విచ్చిన పూల బాలల మధ్య నలిగిన మల్లిపూవంటి జలతారు చీరతో ఆమె కొప్పులోని పూలు విచ్చిన పూల బాలలను చూసి ముడుచుకుపోయి భుజంమీదకు దిగజారి పోతూంటే, బంగారు తళుకులు, చందనంలో అంటుకుపోయి తళతళ్ళాడుతున్న చెంపల్ని గోముగా ముద్దులు పెట్టుంటే

నలుగురు నెచ్చెలులతో సరోగ్స్ కత్తులాడుతూ వాళ్ళు బంగారు కలశాలతో పన్నీరు అందిస్తూంటే ప్రకృతిని చూస్తూ ముఖం తోమేది. జీవితం మంచినీళ్ళ ప్రాయం. ఆమె గుండెల్లో ప్రేమ అన్నదానికి అర్థంలేదు. కాని నమ్మకస్తురాలు. ఒక రోజు ఆమె ముఖం కడుగుకునే సమయానికి ఒక దైవజ్ఞుడు వచ్చాడు. అతన్ని చలువరాతిమీద కూర్చోమని పచార్లు చేస్తూ ముఖం కడిగింది. అది చూసిన అతడు 'నీవు భూదేవిని ఇంత పాడుగుకూ అమంగళం చేశావ్ కనుక వంశక్షయం అయిపోతుంది' అన్నాడు.

ఆమె విలవిల్లాడుతూ ప్రాయశ్చిత్తం వేడింది.

'నువ్వు ఎంతమేరకు అయితే అమంగళం చేశావో అంతమేరా కందకం త్రవ్వించు. ఆపైన భగవంతుని దయ' అన్నాడు దైవజ్ఞుడు. ఆ ఆజ్ఞను ఆమె అక్షరాలా పాటించింది. ఉన్న డబ్బంతా ఖర్చు చేసింది. చెరువు త్రవ్వించింది. ఎంత లోతు త్రవ్వించినా జలపడలేదు. చివరికి ఆత్మార్పణ చేసుకున్నది. మధురాతి మధురమైన జలాలు పడ్డాయి. ఆమె సంతానం బంగారు తూగుటుయ్యాలలో తూగాల్సిన రాణులు. వీధిన పడ్డారు. తమ గానానికీ, నాట్యానికీ, అందానికీ ఎక్కడ పైసలు రాల్తే అక్కడకు వలస పోయారు అలానైజాంలో స్థిరపడ్డది మా నాయనమ్మ తల్లి సింగారి. రజాకార్ల గొడవల్లో నేను దొరికిన దోవగుండా వచ్చేశాను. ఇక్కడ మాకు సుఖంగానే రోజులు గడుస్తున్నాయి. మళ్ళీ పోయేది దేనికి? ఇక్కణ్ణే ఉండిపోయాము నేనూ, శంకూ.

ఈ ఊళ్ళో స్త్రీలకు మేమంటే ఈసు. మగాళ్ళకు ఎంతో దయ.” చిత్రంగా నవ్వింది అన్నమ్మ.

## 3

“అన్ని దిక్కులకూ వెళ్లు. కాని ఉత్తరపు దిక్కుకేసి వెళ్లకు” అంటారు కాశీ మజిలీ కథల్లోని రాజకుమారుణ్ణి. కాని ఆ రాజకుమారుడు ఉత్తర దిక్కుకేసి పనికట్టుకు వెళ్ల డం, అక్కడ రాక్షసుల చేతుల్లో నలిగిపోతున్న రాకుమారిని చూడటం, ఆమెకోసం ఎన్నో అద్భుతాలుచేసి రాకుమారిని సాధించుకోవటం పరిపాటే! నాకు ఈ సాయంత్రం ఆకుమళ్ళ చెరువు కేసి పోవాలని బుద్ధిపుట్టింది. పుట్టడమే తరువాయిగా అక్కడకు వెళ్లిపోయాను. చెరువు గట్టుమీదున్న నా ఎత్తు వల్మీకాన్ని ఆశ్చర్యంతో తిలకించాను. అందులో నివసించే నాగరాజు హొయలు ఊహించుకుంటున్నాను.

“సారీగా”— సన్నని గొంతు ఎలుగెత్తింది. శంకూ పెద్ద పెద్ద రేగడి బెడ్డలు తీసి చెరువు గట్టుమీదున్న ఈతచెట్టు మీదికి విసురుతూంది. గెలల్లోని కాయలు గలగల్లాడుతూ క్రిందకు పడుతూంటే మడిచి కట్టుకున్న పరికిణీ సంచిలోకి ఆత్రంగా ఏరి కుక్కుకుంటూంది. ఆమె ఆ రేగడి బెడ్డలు చెట్టుమీదకు గురిచూసి విసురుతూంటే నరకాసురుడిమీదకు అస్త్రం సంధించే సత్యభామలాగున్నది. ఆ రౌద్ర విలాసం చూస్తున్న నేను రేగడిబెడ్డ వల్మీక రంధ్రంలో పడటం, నాగ రాణికి కోపం వచ్చి పరుషంగా రంధ్రంలోంచి తల పెకెత్తి సత్యభామను గుర్తుచూసుకోవటం నేను గమనించలేదు. గాలి

బుడగలోంచి గాలి పోతున్నప్పుడు కలిగేటటువంటి "ఇస్స్" మన్న ధ్వనికి వెనుతిరిగి చూశాను. సంజకెంజాయలో వెండి చాకులా తళతళ్లాడుతూ అరటిదూటంత లావున్న శ్వేతపన్నగి గజమెత్తు లేచి సొగసుగా పుట్ట క్రిందకు జారసాగింది. నా గుండెలు జల్లు మన్నాయి. వెనుక ముందు లాలోచించకుండా శంకూ వెనకాతలే వెళ్లి ఆమెను చేతుల్లోకెత్తుకుని పుంతలోకి పరుగు తీశాను. ఎంతదూరం పరుగెత్తినా వెనుదిరిగి చూసేసరికి ఆ నాగరాణి జరజరా మమ్మల్ని అనుసరిస్తూనే ఉంది. నా చేతుల్లో మెత్తని శంకూ "ఊంమా ఊంమ్మామ్మా" అంటూ అరవసాగింది. ఆమె కేకలే నాగస్వరం క్రింద విన్పించుతూందా అన్నట్లు పడగెత్తుతూ ఆ ధవళపన్నగి మమ్మల్ని అనుసరించసాగింది. ఇంక ఊళ్లోకొచ్చేస్తామనగా నా కాయాసం కలిగింది. కరణాల మడదగ్గర బాదంచెట్టు క్రింద ఆమెను జారవిడిచి "ఎందు కలా అరుస్తావ్? నిన్ను కాటేయటానికి పామువస్తూంటే తప్పించడంకూడా తప్పేనా" అన్నాను.

ఆమె సంశయంగా నాకేసి చూసింది.

"ఈతచెట్టు దగ్గర పుట్టలేదూ? నీవువేసిన రేగడి బెడ్డ దానికి తగిలింది. అది నిన్ను గుర్తుచూసి పగపట్టింది" అన్నాను. నాకేసి కృతజ్ఞతతో చూసింది.

"ఊళ్లోకి వచ్చేశాంగా! ఫర్వాలేదులే. చీకట్లో బయటకు వెళ్లకు" అన్నా. బుద్ధిగా తలూపింది. ఊళ్లోకి వచ్చేదాకా నా నడుముచుట్టూ చేయివేసి నడిచింది. వాళ్లింటిదాకా దిగపెట్టాను. గుమ్మం దగ్గర చేయిపట్టుకుని ఆపింది. పరికిణీ సంచిలోకి చేయిపెట్టి ఏవో తీస్తూంది.

"నాకు ఈతకాయలు వద్దులే" అన్నాను. గంభీరంగా నవ్వింది. "ప్రాణ దాతవు. నీకు ఈతకాయలు కానుకా" అన్నట్లు ధ్వనించింది. గుప్పెటతో ఎర్రగా పండిన సీమచింత గుండులుతీసి నా చేతిలో పోసింది. ఎన్నిచెట్లు తిరిగి సంపాదించిందో! ఎంత అపురూపంగా పైతొక్కా, లోపలిగింజలూ ఒలిచి దాచుకుందో! అవి కాసినీ నా ఫీజు క్రింద ఇచ్చేసింది. శంకూ ఆప్యాయత ముందు 'ట్రెజర్ ఐలెండ్'లోని ధన రాశులు ఎందుకు?

## 4

జ్యేష్ఠ పౌర్ణమి. చంద్రుని వెన్నెల, వేడిమి భరించలేక మేఘరాజును ఆహ్వానిస్తున్నది. బావ నీటి వంతులకోసం పొలముకేసి వెళ్లాడు. అక్క లోపల నిద్రపట్టక దొర్లుతున్నది. ఇంక అన్ని ఆఫీసులూ తీస్తారు. ఎక్కడో అక్కడ ఉద్యోగం వస్తుంది. తర్వాత? మరి తర్వాత?

నా శంకూతో గడిపిన నెలరోజులూ మధురానుభూతిగా మనస్సు మరులు గొల్పుతున్నది. ఉద్యోగం రాగానే వదిన చెల్లెలు నళినిని పెళ్లిచేసుకొమ్మని వదిన చెబుతూంది. వాళ్లే నాకు చదువు చెప్పించారు. నిజమే. దానికి నేను జన్మంతా కృతజ్ఞుడుగా ఉంటాను. ఏం చేయమన్నా చేస్తాను. కాని వాళ్ల అభిమతం ప్రకారం మనస్సులేని నళినితో జీవితాంతం గడపలేను. నా మనస్సు ఈ పల్లెపట్టులో పారేసుకున్నాను. నాగరాణి కాటువేయకుండానే నన్ను విషమయం చేసింది. అది నేను విశ్వవ్యాప్తం చేయలేను. నళినిని పెళ్లాడి సిమ్లాలో

"స్కేటింగ్", కాశ్మీర్‌లో "బోటు షికారు", బెంగుళూరులో "హైక్లాసు రెస్టారెంటులో" కూల్‌డ్రింక్స్ సిప్‌చేస్తూ లుముంబా హత్యగురించీ, అంగోలాలో దుర్జన ప్రభుత్వం గురించీ చర్చించుకోవటంకన్న నా మాటలురాని శంకూ, అందని గన్నేరుపువ్వు కోసిస్తే అందలమెక్కినట్లు సంతోషించే శంకూ, అక్కయ్య యిచ్చిన కాజాలు తిని సన్నని కళ్లు గుండ్రంగా చేసి అత్యాశ్చర్యం పొందే శంకూ, కాలెండరులో పద్మిని నృత్యభంగిమను చూసి అలా నించోటానికి ప్రయత్నించే శంకూ, నిత్యం నేనేంచేస్తానో అని వేయికళ్లతో నన్ను కనిపెట్టుతున్న శంకూ సాహచర్యమే నాకు అనంతమైన తృప్తిని ఇస్తుంది. ఉద్యోగంరాగానే ఆమెను తీసుకుపోతాను. బావ అధునాతనమైనవాడు; ఉత్తమభావ సంపన్నుడు; ఉదాత్తుడు. అక్కయ్య ఏమీ చేయలేదు. ఇంక అన్నా, వదినా. ఉద్యోగం వచ్చినప్పుడు నేను సర్వ స్వతంత్రుణ్ణి. "ఛన్‌ఛన్ ఛన్." నేను నిద్ర నటించాను. కొండ మల్లి పూలు తెచ్చి నా తలగడ క్రింద పోసింది. నేను లేవలేదు. నెమ్మదిగా నా నుదురుమీద ఊదింది. నా కనురెప్పలు చలించాయి. మృదువుగా మల్లిపూలు రాలుతున్నట్లు నవ్వింది. నేను దగ్గరగా తీసుకుని—

"నాకు ఉద్యోగం రాగానే తీసుకుపోతాను శంకూ! అందాకా జాగ్రత్తగా ఉండు. చెట్లమ్మట, గుట్లమ్మట తిరగకు. కూరగాయలు దొంగలాడకు. అడిగి మరీ కోసుకో. ఏం" అన్నాను. అన్నిటికీ తలూపింది. ఈ నెల రోజుల్లో ఆ పిల్ల ఎంతో నాజూకు నేర్చింది. జుట్టుకు వాసన

నూనె రాసుకునేది. నూనె శ్రద్ధగా రాసుకోవటంతో ఆమె వెంట్రుకలు మెలికలు తిరిగిపోతూ నలుపురంగుకు రాసాగాయి. జడ అల్లేదికాదు. జుత్తంతా మెలికలు తిరుగుతూ భుజం దాకా జారేది. బట్టలు పరిశుభ్రంగా ఉతుక్కుని కట్టుకునేది. అస్తమానం తాంబూలం వేసుకునే అలవాటు నేను వద్దంటే మానేసింది. అపస్వరంగా "సారిగా" అని పాడటం కూడా మానేసింది. ఆమె రాకకు ఆనవాలు ఆమె పదధ్వని మాత్రమే. ఆమెతో కలిసీ తిరిగిన పొలాలగట్లూ, తిన్న సీమ చింతకాయలూ, ఈతకాయలూ, ముంజెలూ నాకు జన్మలో మరపురావు. ఆమెది అంతటి ఉజ్జ్వలమైన ప్రకృతి. చెరువులో ఈదుతూ తుషారదేవత కనికరించి ఇచ్చిన వజ్రాలను తామరాకులు తమ ఒడిలో దాచుకుంటూంటే పనిగట్టుకుని ఈ శంకూ ప్రతి ఆకు దగ్గరికీ వెళ్ళి అస్తారుపదంగా వజ్రాల్ని దాస్తున్న ఆకుల్ని చెరువులోకి ఒంపేసేది. ఇంతలో పిల్లగాలి అలల్ని తట్టి లేపి దూరదూరంగా ఉన్న ఆకుల ఒడిలో వజ్రాల్ని నింపమనేది. మళ్ళీ శంకూకు చేతినిండా పని. ఇలా ఈది ఈది అలసిపోయి విసుగెత్తి చేతి కందినన్ని తామర పూలూ, ఆకులూ, కాయలూ తెంపుకొచ్చేది. కాయల్ని ఒలిచి అందులో ఉన్న గింజల్ని తను తింటూ, నాకూ ఇచ్చేది. అవి జీడిపప్పుల్లా ఉండేవి నాకు.

## 5

శంకూ నా అదృష్టదేవత అని నే నానాడే నమ్ముకున్నాను. లేకపోతే రెండు నెల్లయినా తిరగకముందే నాక్కు

పిల్లాంగుల్లో చేరమని ఆర్డరు వచ్చునా? ఎవరూ తెలియని చోట నేనూ, నా ప్రణయాధిదేవత శంకూ! మనస్సు మధురోహల్లో తేలిపోతూంటే మా అక్క ఊరు వచ్చి చేరాను. అన్నమ్మ ఇంటి తలుపులు తీసేవున్నాయి. గుడిసెమీదికి బలంగా ప్రాకిన బూడిదగుమ్మడి పాదు గుడిసెను క్రిందకు దిగలాగుతూన్నది. ఇంటిముందు జిల్లేడు, రక్కిస దట్టంగా మొలిచాయి. ఇంటిచుట్టూ ఉన్న కంచె చెట్లు దట్టంగా బలిసి ఉన్నాయ్. ఊరంతా నిస్తేజమైనట్లు తోచింది. నా శంకూ గన్నేరుచెట్టుచుట్టూరా ఎన్నోపూలరెమ్మలురాలినయ్. ఏదో శంక బాధించగా "శంకూవాళ్ళెక్కడ బావా?" అన్నాను. మా బావకు మా సంగతి కొంతవరకూ తెలుసు.

"ఏం చెప్పనురా! అన్నమ్మకోసం మునసబు రోజూ దానింటికి పోయేవాడట! ఒక రాత్రి వస్తూంటే, ఎక్కడ పొంచుందో ఒక ఆడత్రాచు కాటేసిందట! దానితో ఊరి వాళ్ళంతా హడలిపోయి అన్నమ్మ మంత్రకత్తె అనీ, దాన్ని ఊళ్ళోంచి వెళ్ళగొట్టాలనీ తీర్మానించారు. పాపం ఆమె ఏ పాపం ఎరుగనన్నా విన్నారు కాదు. వెళ్ళగొట్టేశారు."

"మునసబు చచ్చిపోయాడా?"

"చావలేదు. మంత్రం వేస్తే బ్రతికాడు. అత్తనూ అదేమాట! తను ఆ రోజు 'శంకూ'ను కూడా ఇందులోకి దింపరాదా? అని అడిగాడట. దానితో అన్నమ్మకు కోపం వచ్చి నానామాటలూ అన్నదట. ఆమె సర్పాన్ని తన్ని కాటేయవలసిందిగా మంత్రించిందని; అందుచేతనే ఆ సర్పము

తన్ని కాటేసిందని మున్సబు అన్నాడు. అన్నమ్మ ఎంత మొత్తుకున్నా ఆలకించేవారు లేకపోయారు. చూశావూ, ఇంకో చిత్రం! వాళ్ళు వెళ్ళిపోతూంటే గుమ్మందగ్గర ఒక తెల్లత్రాచు తోకమీద నిలబడిందట!''

''శంకూను కాటేసిందా?'' గుండె దడతో ప్రశ్నించాను.

''లేదు. అందరూ తలో బాదూ బాది చంపేశారు. శంకూ నాకేసి చూసి ఒకటే ఏడ్పురా పాపం! మీ అక్కయ్య ఎప్పుడూలేంది అన్నమ్మకు రెండు పాతచీరలిచ్చింది. శంకూకు అయిదు రూపాయలిచ్చింది. మళ్ళీ నైజాం వెళ్ళారో, సిరికాకుళం వెళ్ళారో మరి!'' అన్నాడు.

శంకూను పాము కాటెయ్యలేదు. నా శంకూ ఎంత అదృష్టవంతురాలు! త్రాచునుంచే కాకుండా త్రాచులాంటి మున్సబు బారినుండి కూడా తప్పించుకుపోయింది. నేను శంకూను వెతుక్కోగలను. ఆ సమర్థత నాకుంది. సీమచింత తోపుల్లో, ఈతచెట్ల నీడల్లో, తామరాకుల చెరువుల్లో విహరిస్తూంటుంది శంకూ. ఎక్కడికి పోతుంది?